క్లుప్తంగా

ఆయిల్‌పాం తోటల పరిశీలన

పెబ్బేరు రూరల్: మండలంలోని మునుగమోని దిన్నె శివారులో సాగు చేసిన ఆయిల్‌పాం తోటలను సోమవారం రైతులతో కలిసి మండల వ్యవసాయ అధికారి చంద్రమౌళి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పాం తోటలో ప్రస్తుతం మంచి లాభాలు వస్తున్నాయని రైతులకు వివరించారు. ఈ తోటల దిగుబడి వచ్చేందుకు మూడేళ్లు పడుతుందని, ఎప్పటికప్పుడు మూగ పువ్వు గెలను తొగించడం ద్వారా అధిక గెలలు వస్తాయన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ నరేష్, రైతులు వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రకళ, సంజన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

పాన్‌గల్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన కళ్యాణ్‌రావును మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎస్‌ఐకి తెలిపారు. కార్యక్రమంలో రాముయాదవ్, గిరిజన సంఘం జిల్లా నాయకులు బాల్యనాయక్, మాజీ సర్పంచ్‌లు జయరాములుసాగర్, వెంకటయ్యయాదవ్, నాయకులు రవీందర్‌గౌడ్, నగేష్‌నాయక్, నిరంజన్‌యాదవ్, శంకర్‌నాయక్, అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐకి అభినందన



కొత్తకోట రూరల్: పెద్దమందడి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులుకు సోమవారం ఏఎస్‌ఐగా పదోన్నతి రావడంతో ఎస్పీ రక్షిత కె.మూర్తి బ్యాడ్జీ అలంకరించి అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో నిక్కచ్చిగా, నిబద్ధతో పనిచేయాలని, ప్రజలకు పోలీసులపై గౌరవం కలిగే విధంగా సేవ చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా వ్యవహరిస్తేనే వారి సమస్యలను చెప్పేందుకు బాధితులు ముందుకు వస్తారన్నారు.

ఉన్నత స్థానాలు అధిరోహించాలి

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన 25 మంది విద్యార్థులు పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం విద్యార్థులకు అభినందించారు. అనంతరం ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు శేఖర్‌ను శాలువాలతో సన్మానించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లే ఉన్నత చదువుల్లోనూ మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సూచించారు.

నీట్‌పై ప్రధాని మౌనం సరికాదు



అమరచింత: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని మత్స్యశాఖ భవనంలో నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యవక్తగా హాజరై బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆదివారం ప్రధాని నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమంలో నీట్‌పై మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణాకు బంగారు గనిగా ఉన్న సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. సింగరేణి వేలం రద్దుచేసి ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆగమేఘాల మీద నిర్మించిన రామాలయంలోకి చిన్నపాటి వర్షాలకే నీరు చేరుతోందని, ఢిల్లీలోని ఎయిర్‌పోర్టు సైతం వర్షానికి కూలిపోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు వెంకటేష్, అజయ్, ఆర్ఎస్ రమేష్, బుచ్చన్న, శ్యాంసుందర్, రాజు, అనంతమ్మ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

జలాశయంలో చేపల వేట వద్దు

పెబ్బేరు రూరల్: నది పరీవాహక గ్రామాల మత్స్యకారులు, లైసెన్స్‌దారులు శ్రీశైలం బ్యాక్ వాటర్, జూరాల జలాశయంలో చేపల వేట చేయరాదని జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో చేపలు తమ సంతతిని పెంచుకొనేందుకు ప్రత్యుత్పత్తి (బ్రీడింగ్) చేస్తాయని, జూలై, ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధించినట్లు పేర్కొన్నారు. అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నది పరీవాహక గ్రామాల్లో చాటింపు వేయించాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను కోరారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన



ఆత్మకూర్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమార్

ఆత్మకూర్: దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన నూతన చట్టాల గురించి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇండియన్ పీనల్‌కోడ్ 1860 ప్రస్తుతం భారతీయ న్యాయ సంహితగా, కోడ్ ఆఫ్ క్రిమినల్ 1973 ప్రస్తుతం భారతీయ నాగరిక్ సురక్షగా, భారత సాక్ష్యా చట్టం 1872 ప్రస్తుతం భారతీయ సాక్ష్యా అదినియమ్‌గా మార్చారని వివరించారు. దీంతో బాధితులకు ప్రభావంతమైన న్యాయం, నేరాన్ని సులభంగా నివేదించడం, నిర్దిష్ట కాలవ్యవధిలో దర్యాప్తు పూర్తిచేయడం, ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయడం, పురోగతి పొందడం, మూడు రోజుల్లోగా పరిశీలించే వీలుంటుందన్నారు. 90 రోజుల్లోపు ఫిర్యాదుదారుడికి న్యాయం చేయడం, వీడియోకాల్ ద్వార సాక్షి విచారణ, ఆన్‌లైన్ సేవా ద్వార సమన్లు, బాధిత మహిళలకు సత్వర న్యాయం, సీనియర్ సిటిజన్లు, చిన్నపిల్లలు ఆన్‌లైన్ ద్వారా వాంగ్మూలం, 33 రకాల వివిధ నేరాలకు పెరిగిరన కఠిన శిక్షలు, 83 నేరాలకు పెరిగిన జరిమానాలు, 23 రకాల వివిధ నేరాలకు తప్పనిసరిగా కనీస శిక్షలు తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు బీచుపల్లి, రోషన్న, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: క్రిమినల్ చట్టాల్లో మార్పులపై సోమవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ప్రజలు, విద్యార్థులకు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. మైనర్‌పై అత్యాచారం కేసులో నిందితుడికి మరణశిక్ష పడుతుందని, గ్యాంగ్ రేప్ కేసులో నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్ష, ఎఫ్‌ఐఆర్ నమోదైన 90 రోజుల్లో కేసుకు సంబంధించిన అప్‌డేట్‌ను కచ్చితంగా నమోదు చేయాలని, కేసు విషయంలో మైనర్లు, మహిళలు, సీనియర్ సిటిజన్స్‌కు పోలీసు స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

గ్రామకంఠం భూములకు రైతుభరోసా నిలిపివేయండి



వీపనగండ్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

వీపనగండ్ల: గృహాలు నిర్మించుకున్న భూములకు రైతుబంధుసాయం నిలిపివేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, అందుకు నిరసనగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. బొల్లారం గ్రామంలోని 618 సర్వే నెంబర్‌లోని 15 ఎకరాల్లో కొందరు 40 ఇళ్లను 40 ఏళ్లుగా నిర్మించుకుంటుండగా.. ఆ భూమిని విక్రయించిన రైతుకు నేటికీ రైతుబంధు వస్తుందని సీపీఐ జిల్లా నాయకులు శ్రీరాం, వంక గోపాల్, రమేష్ ఆరోపించారు. పరిహారం డబ్బులను వెంటనే సంబంధిత రైతు నుంచి రికవరీ చేయాలని వారు తహసీల్దార్ వరలక్ష్మికి విన్నవించారు. నివాసం ఉంటున్న కుటుంబాల వారు కరెంట్ బిల్లు, ఇంటి పన్నును చెల్లిస్తున్నా అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గృహాలు నిర్మించుకున్న కుటుంబాల వారు గోపి, చాకలి స్వామి, ఎం వెంకటయ్య, గొల్ల చిన్న స్వామి తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం వెంకట్

ఆత్మకూర్: మహిళలు పొదుపు సంఘాల ద్వారా రుణాలు పొంది పురుషులకు దీటుగా ఆర్థికంగా రాణించాలని ఏపీఎం వెంకట్ అన్నారు. సోమవారం మండలంలోని జూరాలలో స్వయం సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వడ్డీ లేని రుణాలు పొంది సకాలంలో రుణాలను తిరిగి చెల్లించాలని కోరారు. ఖర్చులు, లావాదేవీలు సంఘం సభ్యులతో చర్చించాలని, వ్యక్తిగతంగా ఖర్చులు చేసిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. అలాగే మండలానికి 45 పాడి పశువుల యూనిట్లు, పెరటితోటలు, కోళ్లపెంపకం 100 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నిర్వాహకులు మహేశ్వరమ్మ, సీసీ అన్వర్‌పాష, వీఓఏ కురుమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్, 11 కేవీ లైన్ మార్చండి



ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న విద్యార్థులు, తండావాసులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, 11 కేవీ విద్యుత్ లైన్ మార్చాలని గిరిజనులు కోరుతున్నారు. సోమవారం తండావాసులు, విద్యార్థులు ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, 11 కేవీ విద్యుత్ లైన్ చూపుతూ వివరాలు వెల్లడించారు. తండాలోని బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్ ఉండటంతో ప్రతి నిత్యం ఈ రోడ్డు ద్వారా విద్యార్థులు, తండావాసులు సంచరిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ఆందోళనగా ఉందని తండావాసులు వాపోయారు. ఎన్నికల ముందు, తండాకు వచ్చిన ప్రతిసారీ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్లుగా సమస్య ఇలాగే ఉందని, ఇప్పటికైనా మంత్రి జూపల్లి ప్రత్యేక చొరవ చూపి ప్రమాదాలు చోటు చేసుకోకముందే ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్ తొలగించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. లేనిచో విద్యార్థులు, తండావాసులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాలకు దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఉచితంగా అందిస్తున్న సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం చెన్నప్ప అన్నారు. రోటరీ క్లబ్, హైదరాబాద్ వారు పేద విద్యార్థుల కోసం అందించిన సైకిళ్లను సోమవారం విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతు పాఠశాలకు సమీప గ్రామాలు పర్వతాపురం, సల్కెలాపురం, ముందలితండా, వెనికితండా నుంచి చాలా మంది విద్యార్థులు వస్తుంటారని చెప్పారు. పేద కుటుంబానికి చెందిన వారు కాలినడకన వస్తున్నారని చెప్పారు. అలాంటి వారికి రోటరీ క్లబ్ వారు ఉచితంగా సైకిళ్లను అందించారని తెలిపారు. క్లబ్ కార్యదర్శి సతీష్‌రెడ్డి, సుదర్శన్‌చారికి ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్ పాల్గొన్నారు.

పాలకులు ఎప్పటికీ ప్రజా సేవకులే



సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: పాలకులు ఎల్లప్పుడు ప్రజలకు సేవకులుగానే ఉండాలని, నిరంతర సేవలతో వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ గుంత మౌనిక ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ హాజరయ్యారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రొ. జయశంకర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎంపీటీసీ సన్మాన కార్యక్రమంలో పాల్గొని సన్మానించి మాట్లాడారు. ప్రజల ఓట్లతో గెలిచి ఐదేళ్లు పదవిలో ఉండి వారికి సేవ చేయడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాయినిపేటలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్‌బాబు, వైస్ ఎంపీపీ వడ్డె శ్రీను, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, కో–ఆప్షన్ సభ్యుడు అల్లబాషా, కాంగ్రెస్ నాయకులు ఎస్‌జే బోయేజ్, మేస్త్రి శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, మిషేక్, మైబు, మాసన్న, సంద వెంకటేష్ వివిధ గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం..

మండలంలోని కానాయపల్లిలో ఆదివారం మృతి చెందిన తోకల రవి, దారమోని గోపాల్ కుటుంబాలను సోమవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ మాజీ డైరెక్టర్ రావుల సురేంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు రావుల జితేంద్రనాథ్‌రెడ్డి, రావుల కరుణాకర్‌రెడ్డి, గోకరయ్య, దారమోని రాములు ఉన్నారు.

నేడు ఎంపీటీసీ సభ్యుల సన్మానం

పాన్‌గల్: ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం ముగుస్తున్నందున మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల సభ్యులు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రైతు దేశానికి వెన్నుముక



ఖిల్లాఘనపురం: రైతు దేశానికి వెన్నుముక లాంటి వాడని జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, మండల విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు గోపి అన్నారు. సోమవారం రైతు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండు వద్ద రైతులను సన్మానించి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు లేకుంటే పట్టెడన్నం కూడ దొరకదన్నారు. రాత్రింబవళ్లు తన సర్వస్వం పొలమే అనుకునే వ్యక్తి రైతు అని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, దేవేందర్, సత్యం గౌడ్ పలువురు రైతులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పక్కాగా ఉండాలి

వనపర్తి టౌన్: విద్యార్థులను తరలించే ప్రైవేట్ స్కూల్ బస్సుల సామర్థ్యం పక్కాగా ఉండేలా చూడాలని, ఫిట్‌నెస్ లేకుండా బస్సు నడిపితే చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆది డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీఓ కార్యాలయంలోని జిల్లా రవాణా శాఖ అధికారిని మానసకు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ అధికారులు దృష్టి సారించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూల్ బస్సుల డ్రైవర్లు మద్యం తాగి విద్యార్థుల ప్రాణాలను బలిగొంటున్నారని, తక్షణమే రవాణా శాఖ అధికారులు స్పందించాలని కోరారు. ఫిట్‌నెస్ లేని బస్సులను వెంటనే సీజ్ చేయడంతో పాటుగా విద్యాసంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షుడు మొగిలి, నాయకులు భరత్, సాయి, మహేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ జులై 10న దేశవ్యాప్తంగా సీఐటీయూ అనుబంధ సంఘాలన్నీ కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్మికుల అందరికీ కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 73 షెడ్యూల్ పరిశ్రమల జీఓలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, బుచ్చమ్మ, గంధం మదన్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పోషక విలువలతో కూడిన బాలామృతం పసిపిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, పారిజాత, చంద్రకళ, లక్ష్మి, కృష్ణమ్మ అన్నారు.

‘ఎమ్మార్సీ’కి ఉపాధ్యాయులు



పాన్‌గల్ ఎమ్మార్సీ వద్ద గుంపులుగా ఉపాధ్యాయులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సోమవారం ఎస్జీటీ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో గుంపులు, గుంపులుగా చేరుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులు బదిలీల ప్రక్రియ పూర్తై పోస్టింగ్ వివరాలు వెలువడటంతో బదిలీ అయిన ఉపాధ్యాయులు రిపోర్టు చేసేందుకు కొందరూ, ఇతర మండలాల్లో పోస్టింగ్‌లు వచ్చిన ఉపాధ్యాయులు రిలీవ్ అయ్యేందుకు మరి కొందరు. ఇలా ఉపాధ్యాయులందరూ ఒకేసారి ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకోవడంతో కార్యాలయం కిక్కిరిసిపోయింది. మండలంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులల్లో ఎనిమిదేళ్లు పూర్తైన ప్రతి ఉపాధ్యాయుడు బదిలీ అయ్యారు. మండలంలో మొత్తం ఎంత మంది బదిలీ అయ్యారు అనే పూర్తి సమాచారం మంగళవారం తెలుస్తుందని మండల విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

హెచ్‌ఎం కుమారుడు ప్రభుత్వ బడికి



పాఠశాలల్లో చేరిన విద్యార్థితో హెచ్‌ఎం, విద్యార్థి తండ్రి

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులు, మెరుగైన విద్యతో రోజురోజుకూ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ఎందరో ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలు కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్న నేటి కాలంలో అందుకు భిన్నంగా పాన్‌గల్ మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇదే గ్రామ వాసి, వీపనగండ్ల మండలం గోపల్‌దిన్నె యూపీఎస్ హెచ్‌ఎం శ్రీనివాసన్ తన కుమారుడు జయపవన్‌ను 2వ తరగతిలో చేర్పించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యను గమనించి తన కుమారుడిని పాఠశాలల్లో చేర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తన కుమారుడి చేర్పించి పలువురికి ఆదర్శంగా నిలిచిన హెచ్‌ఎంను పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచాలి



మట్లాడుతున్న నిక్సన్, శారద

మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.2లక్షలు, ఆయాకు రూ.లక్ష, పీఎఫ్ ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన జీఓ 10ని రద్దు చేయాలని వారు కోరారు. సమావేశంలో కవిత, అరుణ, విజయలక్ష్మి, మంజుల, తార, సువర్ణ, రాధ, నాగరత్నమ్మ, అంసమ్మ, ఈశ్వరమ్మ, ప్రమీల, కృష్ణవేణి, అలీమా బేగం, విజిత, ఆయా ఇందిరమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 4వ వార్డు కమ్మరిగేరికి చెందిన గుణగంటి సాయమ్మ మృతి చెందింది. ఈ విషయాన్ని ఓబీసీ పట్టణ అధ్యక్షుడు మన్నెంకొండ ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ సాయమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అందించిన రూ. 5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ కృష్ణ, ద్యార పోగు వెంకటేష్, తిరుపతయ్య, నాగయ్య ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేటకు చెందిన ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందారు. విషయాన్ని స్థానిక నాయకులు మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పంపించిన రూ.5 వేల సాయాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు మాధవరెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్ నరసింహ, పరశురాముడు, నాగరాజు, ఆచారి శ్యాంసుందర్‌రెడ్డి, శివుడు, వెంకటయ్య ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి బాల్యనాయక్

పాన్‌గల్: జీపీల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్యనాయక్, సీఐటీయూ మండల కన్వీనర్ సూర్యవంశం రాము డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జీపీ కార్మిక సంఘం యూనియన్ నాయకులతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 28 జీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు 5, 6 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెగ్యులర్‌గా వేతనాలు అందక కార్మికుల కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందన్నారు. కార్మికులకు యూనిఫామ్, సబ్బులు, బూట్లు, గ్లౌజులు తక్షణమే పంపిణీ చేయాలన్నారు. పెండింగ్ వేతనాల విడుదల కోసం కార్మికులతో కలిసి ఈనెల 4వ తేదీన ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో సురేష్, నాగేంద్రం పాల్గొన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైంది



కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సన్మానిస్తున్న నాయకులు



ఖిల్లాఘనపురంలో..



వనపర్తిలో..

వనపర్తిటౌన్: వైద్యులు సమాజంలో కనిపించే ప్రత్యక్ష దేవుళ్లని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో డాక్టర్ మురళీధర్, తదితరులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనదని, వ్యాపారంగా కాకుండా సేవగా చూడాలని కోరారు. అదేవిధంగా వనపర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న 35 మంది డాక్టర్లను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బ్రహ్మం, రామిరెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్, అశోక్, నాగన్న యాదవ్, జాత్రునాయక్, తిరుమల్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, సయ్యద్ ఉన్నారు

బీదన్ చంద్రరాయ్‌కి ఘన నివాళి

బీదన్ చంద్రరాయ్ (బీసీ రాయ్) జయంతిని జాతీయ డాక్టర్స్‌డేగా నిర్వహిస్తున్నామని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బీసీ రాయ్ జయంతి, వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి నాయకంటి నరసింహాశర్మ, గంధం నాగరాజు, మండ్ల దేవన్ననాయుడు, బాలేమియా, బండలయ్య, రఘునాథ్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లకు సన్మానం

డాక్టర్స్ డే ను పురస్కరించుకొని డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ ప్రతిభ, డాక్టర్ నగేష్, డాక్టర్ హేమలను మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గులాం ఖాదర్‌ఖాన్ సోమవారం జిల్లా కేంద్రంలోని రమేష్ బాబు స్వగృహంలో శాలువా, బొకే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నీలస్వామి, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందిని రాష్ట్ర సామాజిక స్టూడెంట్ ఆర్గనేజషన్ వ్యవస్థాపకుడు లక్ష్మీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు హాజరై కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర నాయకులు కర్రె సుదర్శన్, ఆర్‌ఎంపీల అసోసియేషన్ మండల అధ్యక్షులు శ్రీశైలం, డాక్టర్ ఆసియాబేగం, డాక్టర్ మంజుశ్రీ, సిబ్బంది వెంకట్, కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: వైద్యులు దేవుళ్లతో సమానమని జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, పంచాయతీ కార్యదర్శి రవితేజ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీఎస్‌పీ ఆస్పత్రిలో వైద్యాధికారులను శాలువాలతో సన్మానించి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో కమ్మరి గోపి, వైద్య సిబ్బంది ఉన్నారు.